వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక
TGTEL/25/A4812
సంపుటి : 01| సంచిక : 57 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ సోమవారం | జూన్ 08, 2026

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు..

- ప్రతిసారీ 'మోసం' అని చెప్పలేం
- పరస్పర అంగీకారంతో జరిగితే నేరంగా పరిగణించలేం
- ప్రేమ బంధాలన్నీ వివాహానికి దారితీయకపోవచ్చు
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

2లో..



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వివాహానికి ముందు ఏర్పడే శారీరక సంబంధాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన శారీరక సంబంధాల ఆధారంగా ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని లేదా నడవడికను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రేమ బంధాలన్నీ ఖచ్చితంగా వివాహానికి దారితీయాలనే నిబంధన ఏమీ లేదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రేమలో ఉన్న సమయంలో భవిష్యత్తులో పెళ్లి చేసుకుంటామనే నమ్మకంతో శారీరక బంధం ఏర్పడి ఉండవచ్చని, అయితే తదనంతర కాలంలో వివిధ కారణాల వల్ల ఆ వివాహం జరగకపోతే.. ప్రతి సందర్భాన్ని 'మోసం' కింద లేదా 'నేరం' కింద పరిగణించడం సాధ్యం కాదని కోర్టు తేల్చిచెప్పింది.

## మోదీ పాలనతో దేశం కష్టాల్లోకి..




- ఇండియా కూటమి భేటీలో ఖర్గే ధ్వజం
- దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారు
- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- ప్రతిపక్షాల కీలక సమావేశానికి హాజరైన 23 పార్టీల నేతలు..
- డీఎంకే, ఆప్ దూరం

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలనలో భారతదేశం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని, బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం తీవ్ర వివక్ష చూపుతోందని ఆయన మండిపడ్డారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో 'ఇండియా' బ్లాక్ కూటమి పార్టీల అధినేతల కీలక సమావేశం జరిగింది. మోదీ ప్రభుత్వ హయాంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కూటమి నేతలను ఉద్దేశించి మల్లికార్జున ఖర్గే ప్రారంభోపన్యాసం చేస్తూ.. కేంద్ర ప్రభుత్వంపై పలు సంచలన ఆరోపణలు చేశారు. దేశ ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అత్యంత ఆందోళనకరంగా ఉందని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని, పారిశ్రామిక రంగానికి వెన్నుముక లాంటి ఎంఎస్ఎంఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని పేర్కొన్నారు. (మిగతా వివరాలు 2వ పేజీలో..)

## నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశం
- పశువైద్యశాలను ప్రారంభించిన మంత్రి

**ఖమ్మం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఖమ్మం జిల్లా వి.వెంకటాయపాలెంలో నూతనంగా నిర్మించిన పశువైద్యశాల భవనాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వి.వెంకటాయపాలెం గ్రామానికి జిల్లా రాజకీయ, సామాజిక చరిత్రలో ప్రత్యేక స్థానముందని కొనియాడారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుతో కలిసి తాను ఈ గ్రామానికి వచ్చిన విషయాన్ని, ఇక్కడే అందరితో కలిసి భోజనం చేసిన మధుర స్మృతులను మంత్రి తుమ్మల ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. "నాడు ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు లేక ఇబ్బంది

2లో..



పడుతున్న తరుణంలో, స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎన్టీఆర్ ప్రభుత్వంలో ప్రత్యేకంగా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి నీటి ఇబ్బందులు తీర్చాం" అని ఆయన వివరించారు.

## బొగ్గు ఉత్పత్తిలో భారత్ 'స్వయం సమృద్ధి'

- విదేశాల నుంచి దిగుమతులు తగ్గించేందుకు పక్కా ప్రణాళిక
- ప్రధాని మోదీ 12 ఏళ్ల నిరంతర కృషితో కోల్ రంగంలో విప్లవాత్మక మార్పులు
- సంస్కరణల ద్వారా 5 లక్షల మందికి ఉపాధి
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని, విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను క్రమంగా తగ్గించి, దేశీయంగా స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై స్వయంగా పర్యవేక్షిస్తున్నారని.. గత 12 ఏళ్ల ఎన్డీయే పాలనలో మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఆయన స్పష్టం చేశారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు కేటాయింపుల్లో రూ.1.89 లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చిందని, నాటి బొగ్గు మంత్రి జైలుకు కూడా వెళ్లారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. (మిగతా వివరాలు 2వ పేజీలో..)



- రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టం
- మంత్రి పొన్నం ప్రభాకర్
- నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాల సీజ్
- నిఘా కోసం 10 ప్రత్యేక బృందాలు,
- 2 రాష్ట్ర స్థాయి స్పెషల్ స్క్వాడ్‌ల ఏర్పాటు

## ప్రయాణికుల భద్రతే ధ్యేయం..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్, రవాణా నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఓవర్ లోడింగ్, ఫిట్‌నెస్ లేని వాహనాలపై తక్షణమే ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే త్రైమాసిక పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్న వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు, అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని స్పష్టం చేశారు. (మిగతా వివరాలు 2వ పేజీలో..)

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 08, 2026

## నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- పశువైద్యశాలను ప్రారంభించిన మంత్రి

(మొదటి పేజీ తర్వాత..) అలాగే, జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం అనేక ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకునే వి.వెంకటాయపాలెంలో కలెక్టరేట్‌ను ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. మనం చేసే ప్రతి పని పదికాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు మంత్రి సూచించారు. వి.వెంకటాయపాలెం గ్రామాన్ని తన శక్తి మేరకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. "మనకు ప్రజల కోసం పనిచేసే మంచి ఆర్డీవో వచ్చారు.. ఆయన ఆధ్వర్యంలో గ్రామాల్లోని భూముల సర్వేను త్వరితగతిన పూర్తి చేయించుకోండి" అని స్థానికులకు సూచించారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీలో ఎలాంటి అన్యాయం జరగకూడదని, గ్రామంలో ఎంతమంది నిజమైన పేదలు ఉంటే అంతమందికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌కు సన్మానం

**శాయంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** శాయంపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, బదిలీపై నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న మంకిడి లక్ష్మణ్‌ను స్థానిక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. లక్ష్మణ్ గత ఐదు సంవత్సరాలుగా శాయంపేట మండలంలో నిరంతరం అందుబాటులో ఉంటూ, ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, బంక రమేష్, చెన్నబోయిన సారంగపాణి, బాసని సాంబమూర్తి, బాసని శ్రీహరి, బాసని జయప్రకాష్, మామిడి శ్రీనాథ్, వైనాల సాంబయ్య, కుక్కల రమేష్, అరికెళ్ల దేవయ్య, బంక శ్రీకాంత్, సుధాకర్, అడప భద్రయ్య, దిడ్డి ప్రభాకర్, బుల్లోజు ఓంకార్, దాన్ సుధాకర్, ప్రపంచ రెడ్డి, దుంపల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పాలనతో దేశం కష్టాల్లోకి..

- ఇండియా కూటమి భేటీలో ఖర్గే ధ్వజం
- దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారు
- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- ప్రతిపక్షాల కీలక సమావేశానికి హాజరైన 23 పార్టీల నేతలు..
- డీఎంకే, ఆప్ దూరం




(మొదటి పేజీ తర్వాత..) పలు రంగాల్లో ప్రైవేట్ కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యం పెరుగుతోందని ఆరోపించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ పరీక్షల నిర్వహణ వైఫల్యాల వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని దుయ్యబట్టారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ వేధింపుల కోసం కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఖర్గే మండిపడ్డారు. ఎన్నికల వ్యవస్థను సైతం ప్రభావితం చేస్తున్నారని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పేరుతో లక్షలాది మంది ప్రజల ఓటు హక్కును అక్రమంగా గల్లంతు చేశారని ఆరోపించారు. మూడేళ్ల క్రితం ఏర్పడిన 'ఇండియా' కూటమి బలం ఏంటో ఇటీవల పార్లమెంట్‌లో అధికార పక్షానికి రుచి చూపించామని ఖర్గే గుర్తుచేశారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును అడ్డుకునేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలన్నీ దృఢమైన ఏకతాటిపైకి వచ్చి విజయం సాధించాయని ప్రశంసించారు. అదే పోరాట స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుంటూ, దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్షాలన్నీ మరింత ఐక్యంగా ముందుకు సాగాలని ఖర్గే పిలుపునిచ్చారు. దేశ రాజధానిలో జరిగిన ఈ అత్యంత కీలక సమావేశానికి దేశవ్యాప్తంగా 23 ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు హాజరయ్యారు. వీరిలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీతో పాటు దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, త్రివన్ ధోల్ ఉన్నారు. అయితే, కూటమిలో కీలక భాగస్వామ్య పక్షాలుగా ఉన్న డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు ఈ సమావేశానికి దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




# పెళ్లికి ముందే శారీరక సంబంధాలు..

- ప్రతిసారీ 'మోసం' అని చెప్పలేం
- పరస్పర అంగీకారంతో జరిగితే నేరంగా పరిగణించలేం
- ప్రేమ బంధాలన్నీ వివాహానికి దారితీయకపోవచ్చు
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తర్వాత..) పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలకు, అలాగే కేవలం శారీరక లబ్ధి కోసమే మోసపూరిత వివాహ వాగ్దానం చేసి ఏర్పరచుకున్న సంబంధాలకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంటుందని, న్యాయస్థానాలు దీనిని గుర్తించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇద్దరి మధ్య శారీరక సంబంధం ఏర్పడిన సమయంలో.. సదరు వ్యక్తికి వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా? లేదా? అనే కోణాన్ని కేసుల వారీగా లోతుగా పరిశీలించాల్సి ఉంటుందని సూచించింది. కేవలం ఒక బంధం పెళ్లి పీటల వరకు వెళ్లలేదు అనే ఒకే ఒక్క కారణంతో, అవతలి వ్యక్తిపై మోసపూరిత ఆరోపణలు చేయడం లేదా క్రిమినల్ కేసులు పెట్టడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది. వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాల పట్ల మారుతున్న న్యాయవ్యవస్థ దృక్పథానికి ఈ తీర్పు అద్దం పడుతోందని చట్ట నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంగీకారంతో కూడిన బంధాలకు, నేరపూరితమైన మోసాలకు మధ్య ఉన్న సన్నని గీతను ఈ తీర్పు స్పష్టం చేసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బొగ్గు ఉత్పత్తిలో భారత్ 'స్వయం సమృద్ధి'

- విదేశాల నుంచి దిగుమతులు తగ్గించేందుకు పక్కా ప్రణాళిక
- ప్రధాని మోదీ 12 ఏళ్ల నిరంతర కృషితో కోల్ రంగంలో విప్లవాత్మక మార్పులు
- సంస్కరణల ద్వారా 5 లక్షల మందికి ఉపాధి
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

(మొదటి పేజీ తర్వాత..) కాంగ్రెస్ హయాంలో కేటాయించిన కోల్ మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిందన్నారు. అయితే, మోదీ ప్రభుత్వం వచ్చాక తీసుకొచ్చిన పారదర్శక సంస్కరణల వల్ల దేశవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. ప్రస్తుతం దేశంలో రికార్డు స్థాయిలో 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు (సుమారు 80 రోజులకు సరిపడా) అందుబాటులో ఉన్నాయని, దీనివల్ల విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం ఉండదని స్పష్టం చేశారు. చైనా తర్వాత ప్రపంచంలో అత్యధిక బొగ్గు వినియోగం భారత్‌లోనే ఉందని, దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72 శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని వివరించారు. ఈ ఏడాది దేశం 1 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని దాటిందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. క్రిటికల్ మినరల్స్‌లో స్వయం సమృద్ధి సాధించేందుకు 'క్రిటికల్ మినరల్స్ మిషన్' ప్రయోగానికి కేంద్రం రూ.1,500 కోట్లు కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం 24 రకాల కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటున్నామని, అందులో భాగంగానే అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్‌ను భారత్ సొంతం చేసుకుందని వెల్లడించారు. అలాగే కోల్ ఆధారంగా సింథటిక్ గ్యాస్ తయారీపై, అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నామని.. దీనిపై ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ వేలం పూర్తి చేస్తామన్నారు. ఉపయోగం ముగిసిన 187 బొగ్గు గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేసి.. అక్కడ వృక్షారోపణ, పర్యాటక రంగాలను అభివృద్ధి చేసి గిన్నిస్ రికార్డుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గనుల ప్రభావిత గ్రామాల అభివృద్ధి కోసం ఉద్దేశించిన 'డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్' నిధుల విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై కిషన్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. చట్ట ప్రకారం 2 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను జిల్లాలకు విడుదల చేయడం లేదని, కలెక్టర్లను అడిగితే నిధులు రావడం లేదంటున్నారని ఆరోపించారు. గతంలో ఈ నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని దుయ్యబట్టారు.సింగరేణి కాలరీస్ వ్యవహారాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని స్పష్టం చేసిన మంత్రి.. సింగరేణి ఆర్థిక భారం తగ్గించేందుకు, కార్మికులకు మెరుగైన బీమా సదుపాయాలు కల్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకుందని తెలిపారు. కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించారని.. గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సామాజిక సంక్షేమ రంగాల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తూ ముందుకు సాగుతోందని కిషన్‌రెడ్డి కొనియాడారు.

# ప్రయాణికుల భద్రతే ధ్యేయం..

- మంత్రి పొన్నం ప్రభాకర్

ఇందుకోసం ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను, రాష్ట్ర స్థాయిలో రెండు స్పెషల్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాల్సిందేనని మంత్రి పొన్నం ప్రభాకర్ తేల్చి చెప్పారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను రవాణా చేస్తే.. అలాంటి వాహనాలను నిర్దాక్షిణ్యంగా సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఖ్యంగా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రైవేట్ స్లీపర్ బస్సుల్లో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘనలకు ఇకపై పూర్తిగా చెక్ పెడతామన్నారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడితే ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ ముఖ్యాంశాల సమీక్షా సమావేశంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబరితి, అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, జేటీసీ చంద్రశేఖర్ గౌడ్, డీటీసీలు రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
సోమవారం, జూన్ 08, 2026

# వేములవాడలో చైన్ స్నాచింగ్ గుట్టురట్టు..

• 24 గంటల్లోనే నిందితుల అరెస్ట్

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో కలకలం రేపిన మహిళా భక్తురాలి మెడలోని మంగళసూత్రం చోరీ కేసును టౌన్ పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. అత్యంత వేగంగా స్పందించిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.లక్షల విలువైన బంగారు మంగళసూత్రంతో పాటు నేరానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా న్యాల్కల్ గ్రామానికి చెందిన మాముళ్ల నవనీత అనే మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనం కోసం వేములవాడకు వచ్చారు. సోమవారం తెల్లవారుజామున ఎస్.ఆర్. ఆర్. పార్కింగ్ ప్రాంతంలో ఓచోట కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న సమయంలో, ఇద్దరు దొంగలు ఆమె మెడలోని బంగారు మంగళసూత్రాన్ని లాక్కునేందుకు ప్రయత్నించారు. బాధితురాలు గట్టిగా ప్రతిఘటించడంతో.. నిందితులు ఆమె నోరు నొక్కి, ఊపిరి ఆడకుండా చేసి బలవంతంగా మంగళసూత్రాన్ని తెంచుకుని బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో వేములవాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వేములవాడ టౌన్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పట్టణవ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా అసలు దొంగతనం వెలుగుచూసింది. సిద్ధిపేట



జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన అకమ్మ అశోక్ (29), పంజా చందు (31)లుగా నిందితులను గుర్తించారు. నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించాలనే వ్యసనంతో ఆస్తి నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. ఈ నేరానికి పాల్పడడానికి ముందే వీరు సిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పార్క్ చేసి ఉన్న హీరో హోండా స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్‌ను దొంగిలించారు. అదే దొంగతనపు బైక్‌పై వేములవాడకు వచ్చి, ఇక్కడ ఒంటరిగా నిద్రిస్తున్న మహిళను టార్గెట్ చేసి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుల వద్ద నుండి రూ. 1.50 లక్షల విలువైన సుమారు 20.120 గ్రాముల బంగారు మంగళసూత్రంతో పాటు చోరీకి ఉపయోగించిన స్ప్లెండర్ ప్లస్ బైక్ (ఏపీ28 బీపీ 3153) ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు తెలిపారు. కేసును 24 గంటల లోపే ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ రాంమోహన్, పీసీలు గోపాల్, పంతులు, బ్లూ కోల్ట్ పీసీ సంపత్‌లను వేములవాడ టౌన్ సీఐ (ఇన్‌స్పెక్టర్) ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. పుణ్యక్షేత్రమైన వేములవాడకు వచ్చే భక్తులు ముఖ్యంగా రాత్రి సమయాల్లో తమ విలువైన నగలు, వస్తువుల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని టౌన్ పోలీసులు సూచించారు. పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# పెంచిన గ్యాస్, నిత్యవసరాల ధరలను తగ్గించాలి

కాంగ్రెస్ నేత అంబాల రాజు



**జమ్మికుంట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, పేద, మధ్యతరగతి ప్రజలపై మోయలేని ఆర్థిక భారాన్ని మోపుతోందని జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం జమ్మికుంటలో ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో సామాన్య కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో.. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరను మరో రూ. 29 పెంచడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ అదనపు పెంపు సామాన్యుడి నడ్డి విరచడమేనని ఆయన మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపు వల్ల దేశంలోని కోట్ల మంది గృహిణులు, రైతులు, కార్మికులు మరియు సాధారణ లబ్ధిదారులపై తీవ్రమైన ప్రభావం పడుతుందని అంబాల రాజు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, కేవలం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ధరలు పెంచడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్ తక్షణమే స్పందించి, పెంచిన గ్యాస్ ధరలతో పాటు అన్ని నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం మొండిగా ముందుకు సాగితే.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కేంద్రానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, రోడ్డు పైన ధర్నాలు చేపడతామని అంబాల రాజు హెచ్చరించారు. ఇకనైనా కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా ప్రయోజనకరమైన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజలే రాబోయే రోజుల్లో మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఈ సందర్భంగా అంబాల రాజు హెచ్చరించారు.

# అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల ఐడీఓసీలో అట్టహాసంగా 'ప్రజావాణి'..
- 154 దరఖాస్తుల గుర్తింపు
- ఆర్డీవో కార్యాలయాల్లోనూ గ్రీవెన్స్..
- సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపు
- అర్జీదారులకు సత్వర న్యాయం చేయాలని అధికారులకు ఆదేశం

**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను అధికారులు నిర్దేశిత గడువులోగా, సకాలంలో పరిష్కరించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ప్రధాన ఆడిటోరియంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితుల నుండి కలెక్టర్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై రికార్డు స్థాయిలో మొత్తం 154 దరఖాస్తులు వచ్చాయి. బాధితుల సమస్యలను పరిశీలించిన కలెక్టర్.. ఆయా శాఖల అధికారులకు దరఖాస్తులను బదిలీ చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు సిరిసిల్ల, వేములవాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లోనూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. దూర ప్రాంతాల నుండి కలెక్టరేట్‌కు రాలేని స్థానిక ప్రజలు తమ ప్రాంతాల్లోని ఆర్డీవో కార్యాలయాల్లోనే అర్జీలను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజావాణికి వచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, చట్టపరిధిలో బాధితులకు మేలు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఐడీఓసీలో నిర్వహించిన ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మహనీయుల ఆశయాల సాధనకే 'జ్ఞానచైతన్య రథయాత్ర'



- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- చైతన్య రథాన్ని జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** దేశ మహనీయుల ఆశయాల సాధనతో పాటు రాజ్యాంగ ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజల్లో చైతన్యం కల్పించడమే 'జ్ఞానచైతన్య రథయాత్ర' ముఖ్య లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణంలో ప్రత్యేకంగా రూపొందించిన జ్ఞానచైతన్య రథయాత్ర బస్సును ఆయన జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. సమాజ ప్రగతికి పునాదులు వేసిన మహనీయుల సిద్ధాంతాలను, ఆశయాలను నేటి తరం ప్రజల్లోకి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం కోసమే ఈ రథయాత్రను చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. యువతలో జ్ఞానాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి రథయాత్రలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. నేటి యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ప్రగతి పథంలో నడవాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులను అవగాహన చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సాగనున్న ఈ యాత్రను ప్రజలంతా విజయవంతం చేయాలని కోరారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన ఫలాలపై, హక్కులపై ఈ రథయాత్ర ద్వారా పల్లెపల్లెనా ప్రజలను చైతన్యపరచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామనాథం, శారదమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 08, 2026

# బొల్లె రాజుకు 'ఉత్తమ జర్నలిస్ట్' అవార్డు

## శ్రీకాళహస్తిలో ఘనంగా పురస్కార ప్రదానం



**కల్వకుర్తి, వాయిస్ ఆఫ్ వందే భారత్:** కల్వకుర్తి పట్టణానికి చెందిన 'జ్యోతి' పత్రిక రిపోర్టర్ బొల్లె రాజు జాతీయ స్థాయి ఉత్తమ జర్నలిస్టు అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళహస్తిలో శుక్రవారం జాతీయ తెలుగు సారస్వత పరిషత్తు, జ్యోతి పత్రికల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కవి సమ్మేళనం, జాతీయ వాగ్దేవి పురస్కారాలు, ఉత్తమ జర్నలిస్టుల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ అహ్మద్ షరీఫ్, శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టె సాయి కుమార్ల చేతుల మీదుగా రాజు ఈ విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ.. సమాజంలో ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి, సమాజ హితం కోసం నిరంతరం శ్రమించేవారిలో జర్నలిస్టులే మొదటి వరుసలో ఉంటారని కొనియాడారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. కల్వకుర్తి ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, అవార్డు దక్కించుకున్న జర్నలిస్టు బొల్లె రాజును ఆయన స్నేహితులు, తోటి పాత్రికేయులు, పట్టణ ప్రముఖులు ఘనంగా అభినందించారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# ఓటర్ల జాబితా సవరణపై నిఘా ఉంచాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- అచ్చంపేటలో కాంగ్రెస్ 'సర్'పై బీఎల్ఏలకు శిక్షణ
- జూన్ 25 నుంచి ఇంటింటి ఓటర్ల సర్వే..
- బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజాస్వామ్యంలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, నియోజకవర్గంలోని ప్రతి బూత్ స్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్లు సమర్థవంతంగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని నాగర్ కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ



కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ శిక్షణ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు నాగర్ కర్నూల్ పార్లమెంట్ సంఘటన సృజన అభియాన్ కోఆర్డినేటర్, 'సర్' శిక్షణ కార్యక్రమాల ఇంచార్జ్ రాచమల్ల సిద్దేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రతి బూత్ నుండి కాంగ్రెస్ పార్టీ తరపున నియమితులైన బీఎల్ఏలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన డేటా సేకరణ జరిగేలా చూస్తూ, అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 'సర్' ప్రక్రియ యొక్క ముఖ్య ఉద్దేశ్యాన్ని ఏజెంట్లకు వివరించారు. ఓటర్ల జాబితా సవరణ విధానం, కొత్త ఓటర్ల నమోదు, పేర్లలోని తప్పుల సవరణతో పాటు ఒకే ఓటరు రెండు చోట్ల నమోదైన డూప్లికేట్ ఎంట్రీలను గుర్తించి తొలగించడం వంటి కీలక అంశాలపై ఏజెంట్లకు నిపుణులు విపులంగా అవగాహన కల్పించారు. గ్రామ, వార్డు స్థాయిల్లో పార్టీని బలోపేతం చేస్తూనే, ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ సైనికులపై ఉరదని ఈ సందర్భంగా నేతలు దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్చార్జిలు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
- సిరిసిల్ల పోలీస్ కార్యాలయంలో 'గ్రీవెన్స్ డే'..
- 26 ఫిర్యాదులు స్వీకరణ
- బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలి
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల నమోదు..
- ఎప్పటికప్పుడు పురోగతిపై సమీక్ష

**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం చేయడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే స్పష్టం చేశారు. బాధితులకు భరోసా కల్పించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఎస్పీ స్వయంగా 26 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల సమస్యలను చట్టపరంగా, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే తమ ధ్యేయమన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది ఎంతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని దిశానిర్దేశం చేశారు. బాధితుల వినతులను ఓపికగా ఆలకించి, అవసరమైతే వివాదాల క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అప్పుడే ఫిర్యాదుదారులకు పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా కలుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. గ్రీవెన్స్ డే లో ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్ వ్యవస్థలో పొందుపరుస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఆయా అర్జీలు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల స్థాయిలోనే సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తున్నామని చెప్పారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడానికి గ్రీవెన్స్ డే ఒక మంచి వేదికని, దీని ద్వారా సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఎస్పీ మహేష్ బి.గితే వివరించారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య




- హెచ్ఎం భాషమోని కొండయ్య
- సర్కారు బడుల్లోనే కార్పొరేట్ స్థాయి వసతులు..
- ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం

**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, నాణ్యమైన విద్యను అందించేలా చూడాలని సూరాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాషమోని కొండయ్య తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. మండలంలోని చెన్నంపల్లి, సూరాపూర్ గ్రామాలలో సోమవారం 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విస్తృతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయుల బృందం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారి తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడారు. అనంతరం సూరాపూర్ గ్రామసభలో ప్రధానోపాధ్యాయులు కొండయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని గుర్తుచేశారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా సర్కారు బడుల్లో విద్యాబోధన సాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందించడంతో పాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పిస్తోందని హెచ్ఎం వివరించారు. విద్యార్థులకు కావలసిన అన్ని రకాల మౌలిక వసతులను ప్రభుత్వం సమకూరుస్తోందని చెప్పారు. బడి బయట ఉన్న పిల్లలతో పాటు ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను కూడా వారి ఉజ్వల భవిష్యత్తు కోసం వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కొండయ్య తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేటు బడుల వైపు వెళ్లి అనవసరంగా ఆర్థికంగా నష్టపోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.